ఆటోడ్రైవర్‌లను ఆదుకోవాలి


సీఐకి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ పట్టణంలో ఆటో వృత్తిపై జీవనాధారం సాగిస్తున్న డ్రైవర్ల సమస్యలపై శనివారం టౌన్ సీఐ మున్నూరు కృష్ణకు బాన్సువాడ సీఐటీయూ నాయకులు ఖలీల్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ కృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా వేగ నియంత్రణ, యూనిఫామ్, లైసెన్స్ ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. ఇచ్చిన దరఖాస్తు ఫారం ను మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తానన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నేత ఖలీల్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు జీవన వృత్తిగా మారిన ఆటోలకు గిరాకీ లేకుండా పోయిందన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు వలన ప్రయాణికులు ఆటోలో ప్రయాణించడం తగ్గిందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఖలీల్,, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు,

ఐఎంఏకు మద్దతు తెలిపిన టీఎంఎస్ ఆర్‌యుశాఖ (సీఐటీయూ)


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కలకత్తాలో వైద్య విద్యార్థిని పై జరిగిన లైంగికదాడిని, హత్యను నిరసిస్తూ కామారెడ్డి ఐఎంఏ ఈ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి తెలంగాణ మెడికల్ రీప్రజెంటీవ్ యూనియన్ (సీఐటీయూ) కామారెడ్డి శాఖ మద్దతు తెలుపుతుందని అధ్యక్షులు రవీంద్ర చారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నాం అని, నిందితునికి కఠినంగా శిక్షించే వరకు ఐఎంఏ కు మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి , కార్యదర్శి జి. ప్రేమ్ కుమార్ , కోశాధికారి బియన్ సంతోష్ కుమార్, టి ఎమ్ ఎస్ఆర్‌యు 50 మంది సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోలీసులు

డ్రగ్స్‌తో అనేక దుష్పరిమాణాలు

- జిల్లా టిఎస్ నాబ్ అధికారి డిఎస్పి సోమనాథం

నవతెలంగాణ-కామారెడ్డి

డ్రగ్స్‌తో అనేక దుష్పరమాణాలు ఉంటాయని వాటిని సేవించి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా టిఎస్ నాబ్ అధికారి డిఎస్పి సోమనాథం సూచించారు. దేవనపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కామారెడ్డి డిగ్రీ కాలేజ్‌లో డ్రగ్స్ నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ తీసుకుంటే కలిగే దుష్పరిణామాలు, దాని పర్యవసానాలు తెలిపారు. ఎవరైనా డ్రగ్ సరఫరా గాని అదేవిధంగా తీసుకున్నట్లయితే వివరాలను తెలియజేయాలన్నారు. డయల్ 100 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14446 కి తెలపాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తును మంచిగా నిర్మించుకోవాలని, ఎలాంటి చెడు ప్రవర్తనలకి, దురావాట్లకు లోను కాకూడదని విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవనపల్లి ఎస్ఐ రాజ, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్ఎంసి సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు రాజకీయం చేయొద్దు

- ఎస్ఎంసి సమావేశంలో తల్లిదండ్రుల ఆవేదన

నవతెలంగాణ-రామారెడ్డి

సమాజ మెరుగు కోసం, విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్ద వలసిన ఉపాధ్యాయులు పవిత్రమైన వృత్తిలో ఉండి రాజకీయం చేయవద్దని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... విద్య బోధన సమయంలో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను వాడుతున్నారని, సమస్యలను ఎత్తి చూపితే విద్యార్థులపై కక్ష పెంచుకుంటున్నారని అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, బాలుర పాఠశాల శిథిలావస్థలో ఉన్నందున, భవనాలను తొలగించాలని సూచించారు. ఉపాధ్యాయులపై వచ్చిన ఆరోపణలను మండల విద్యాశాఖ అధికారి యోసేఫ్ మాట్లాడుతూ.., ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని, ఉపాధ్యాయులు ఏమైనా పొరపాట్లు చేసి ఉంటే, విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరయ్య, ఎస్ ఎం సి కమిటీ చైర్మన్ ల్యాగల నాగలక్ష్మి, మాజీ చైర్మన్ ఉష్కే రాజేందర్, బండ కింది రమేష్, దేవదాస్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసన

వైద్యుల రక్షణ కోసం చట్టం తేవాలి

- మెడికోను లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితుడికి కఠినంగా శిక్షించాలి
- ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసనలు..
- కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి/కంఠేశ్వర్

వైద్య విద్యార్థిని దారుణంగా హింసించి లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శనివారం పలు చోట్ల నిరసన చేపట్టారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇరు జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఎదుట వైద్యులు ధర్నా చేపట్టి కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

కామారెడ్డిలో ఐఎంఏ, ఐడీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్కడ జరిగిన ఘటనను కప్పిపుచ్చేందుకు వైద్య కళాశాల నుండి విద్యార్థినిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకుదని చెప్పడం బాధాకరమైన విషయం అన్నారు. ఆ తర్వాత విషయం వెలుగులోకి రాగా అక్కడి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టు ఈ కేసును సిబిఐకి అప్పగించిందన్నారు. తెల్ల కోటు వేసుకొని పవిత్రమైన వైద్య వృత్తిని అందిస్తున్న మా తెల్ల కోర్టుపై రక్తాన్ని మరక వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వాలు అండగా ఉండడం సోచనీయ మని ఇలాంటి దుండగులను పట్టుకుని 100 రోజుల్లో ఉరితీయాలి అన్నారు. నిందిత ఎడిపై ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. నిందితుని పట్టుకొని శిక్షించడంలో ప్రభుత్వం విఫలమైతే దీనిని మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు స్పందించి ఖండించవలసిన విషయం అన్నారు.

వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చర్య పై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర దేశవ్యాప్తంగా మంటలు రగిలే అవకాశం ఉందని ఇలాంటి నిందితులకు బహిరంగ శిక్ష వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రమణ, కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్, అసోసియేషన్ నాయకులు డాక్టర్ రామలింగం, డాక్టర్ వెంకటరాజ్యం, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ శ్రీ లీల, డాక్టర్ ఉమా జనార్ధన్, డాక్టర్ రాజలక్ష్మి, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు మాధవి లత, కార్యదర్శి అభిషేక్ రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : పశ్చిమ బెంగాల్ లోని కలకత్తాలో ఇటీవల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీజీ విద్యార్థిగా చదువుతున్న విద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా నిజామాబాద్ నగరంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేయగా.. ఇండియల్ డెంటల్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వైద్యులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ సుగుణాకర్, డాక్టర్ కవిత, డాక్టర్ స్వరూప, రఘు, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.





కంఠేశ్వర్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ముందు జూనియర్ డాక్టర్ల నిరసన

నాలుగోరోజూ కొనసాగిన జూడాల నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

మెడికల్ విద్యార్థినీపై జరిగిన లైంగికదాడి, హత్యను నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4వ రోజు శనివారం ఆందోళనలు కొనసాగాయి. ఈ సందర్భంగా భారతదేశ చిత్రపటం గీసి మృతి చెందిన మెడికల్ విద్యార్థిని చిత్రపటాన్ని మెడికల్ విద్యార్థులు అందులో ఆమె చిత్రాన్ని వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాలుగవ రోజు జూడ విద్యార్థులకు నిజామాబాద్ నగరంలో ప్రైవేట్ హాస్పటల్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థలు, తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్లు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. అత్యాచార ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని దోషులుగా నిర్ధారించబడిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



అర్హులకు పోడు పట్టాలు

- పంపిణీపై సమగ్ర వివరాలు అందించండి
- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- పటిష్ట కార్యాచరణలో పంపిణీ చేయనున్నట్టు వెల్లడి
- ఎమ్మెల్యేలతో, కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష


కామారెడ్డిలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు


నిజామాబాద్‌లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

పోడు భూముల పంపిణీకి సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం మంత్రి కొండా సురేఖ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాలలో ఇప్పటివరకు పోడు పట్టాల కోసం వచ్చిన క్లెయిముల ఎన్ని, వాటిలో ఎంతమందికి ఎన్ని ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశారు.? ఇంకా ఎన్ని క్లెయిములు పెండింగ్ లో ఉన్నాయి, అందుకు గల కారణాలు ఏమిటి, పట్టాలు పొందిన వారికి భూమి హద్దులు చూపించారా తదితర వివరాలను ఒక్కో జిల్లా వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రెండు విడతలుగా రాష్ట్రంలో పోడు పట్టాల పంపిణీ జరిగినప్పటికీ, ఇంకనూ పలుచోట్ల గిరిజనుల నుండి వినతులు వస్తున్నాయని అన్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోడు భూములు, పట్టాల పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలను నిర్ణీత గడువులోపు పంపించాలని సూచించారు. వీటిపై ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. అయితే, ఎక్కడ కూడా అటవీ భూముల ఆక్రమణ, చెట్ల నరికివేత జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. అడవుల నరికివేత వల్ల కలిగే నష్టాల గురించి అటవీ, సరిహద్దు ప్రాంతాల ప్రజలందరిలో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

చెట్లు నరికివేతపై చర్యలు తీసుకోండి : ఆర్మూర్ ఎమ్మెల్యే

కాగా సిరికొండ మండలం రావుట్లలో అటవీ భూమిని కొంతమంది యథేచ్ఛగా చెట్లు నరికివేసి కబ్జాలకు పాల్పడుతున్నారని వీ.సీలో పాల్గొన్న సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, వెంటనే అదనపు కలెక్టర్‌ను పంపించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపిస్తామని తెలిపారు.

అటవీ సరిహద్దు గ్రామాలకు రవాణ వసతి మెరుగుపర్చండి : రూరల్ ఎమ్మెల్యే

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ, తన నియోజకవర్గంలోని 7 మండలాలలో పోడు భూముల సమస్య నెలకొని ఉందని, అర్హులైన వారికి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. అదేవిధంగా మారుమూల గిరిజన తండాలు, అటవీ సరిహద్దు గ్రామాలకు రవాణా వసతిని మెరుగుపర్చేందుకు రోడ్లు నిర్మించాలని, తాగు నీటి వసతి ఇత్యాది సౌకర్యాలు కల్పించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగూరావు, అటవీ శాఖ డివిజనల్ అధికారి భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం 13 డిసెంబర్ 2005 నాటికి సాగు చేస్తున్న గిరిజనులు, లేదా 13 డిసెంబర్ 2005 నాటికి మూడు తరాలపాటు సాగు చేసిన గిరిజనేతరులకు పోడు భూముల పట్టా పంపిణీ అర్హులని అధికారులు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత,జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి రజిత, కామారెడ్డి ఆర్ డి ఓ రంగనాథరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కల్లు గీత వృత్తికి రక్షణ

- పోరాట యోధుడు సర్వాయి పాపన్న
- రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం సలహాదారు పెద్దివెంకట్‌రాములు

నవతెలంగాణ-నందిపేట్

కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు వైన్స్‌లను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నాయని, గీతవృత్తిని రక్షించుకునేందుకు పోరాటాలే మార్గమనిరాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం సలహాదారు పెద్దివెంకట్‌రాములు అన్నారు. పోరాట యోధులు సర్వాయి పాపన్న చూపిన బాటలో నడవాలని సూచించారు. మండల కేంద్రంలో తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరుల యాదిలో గౌడ గీతన్నల చైతన్య యాత్ర సదస్సును మండల గీత కార్మిక సంఘం భవనంలో శనివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పెద్దివెంకట్ రాములు హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల కోసం అహర్నిశలు పోరాడి బహుజన సామాజిక విప్లవ పోరాట ఉద్యమం కోసం 2000 మంది సైన్యాన్ని తయారు చేసి ఏకం చేసి గొప్ప యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ప్రతి ఒక్కరూ సర్వాయి పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్ళవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గీత వృత్తిలో వస్తున్న సమస్యల పరిష్కారం కోసం గీత కార్మిక సోదరులంతా ఐక్య పోరాటాలు చేస్తేనే తప్ప మన సమస్య పరిష్కారం కాదని సూచించారు. పాలకవర్గాలు గీత్తిని ఇబ్బంది పెట్టే కుట్రలు చేస్తున్నాయని, అందుకే విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారని, హక్కులు లేకుండా చేస్తున్నారని వీటన్నిటి నుంచి బయటపడి మన వృత్తిని కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలంటే పోరాటమే మార్గమని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోయేడి నర్సింలు గౌడ్, ఊర్మిళ శ్రీరామ్ గౌడ్, సిదుగు శేఖర్ గౌడ్, పెద్ది సూరి, మీడియా ఇంఛార్జి కట్టా నరేశ్ కుమార్, నందిపేట్ శ్రీనివాస్ గౌడ్, నాందేవ్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, హనుమండుల్ గౌడ్, దేవేందర్, గణేష్ గౌడ్, సుమన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్, దత్తాద్రి గౌడ్, తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం సలహాదారు పెద్దివెంకట్‌రాములు

నిరుపేద కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న రెబల్స్ యూత్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని చింతలూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి రెబల్స్ యూత్ వారు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్టు కోలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన గాదె చిన్న ఆశన్న చనిపోవడంతో ఆ విషయం తెలుసుకొని ఫ్రాన్స్ నుంచి రెబల్స్ యూత్ వారు రూ.10వేలు పంపారు. సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో చింతలూరు గ్రామస్తులు తదితరులున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ ఎమ్మార్వో పి.శ్రీకాంత్ జిల్లా ఉత్తమ ఎమ్మార్వోగా అవార్డు పొందిన సందర్భంగా శనివారం ఉదయం మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామపెద్దలు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, లోక నర్సయ్య, జక్కుల రాము, జక్కుల శ్రీను, లింగపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

- సమ్మె నోటీసు అందజేసిన ఆరోగ్యమిత్రలు


మెడికల్ ఆఫీసర్‌కు నోటీసు అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

నవతెలంగాణ-బోధన్
ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్య మిత్రలు సమ్మెకు పిలుపునివ్వడంతో శనివారం ఆరోగ్యమిత్రలు మాచర్ల శంకర్, ఎర్రోల్ల సురేష్ బోధన్ ప్రభుత్వాసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా.సోఫీపాషాకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఆరు మాసాలుగా ప్రభుత్వానికి తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందించినా స్పందించడం లేదని అన్నారు. దాంతో ప్రభుత్వ తీరుకు నిరసనగా జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలను పెంచాలని, ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ హెూదా కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆరోగ్యశ్రీ పథకం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్ భారత్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పథకం, ప్రభుత్వ హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంబిఏ, పి.జి. డిగ్రీ అర్హతతో కూడిన దాదాపు 900 మంది సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో జిల్లా మేనేజర్, టీమ్ లీడర్, ఆఫీస్ అసోసియేట్ ఆరోగ్య మిత్రలుగా 24 గంటలు విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ పనితనం వలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి దేశవ్యాప్తంగా మంచిపేరు తీసుకురావడంలో కృషి చేసినట్లు తెలిపారు. అయినా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని వాపోయారు. 17 సంవత్సరాలుగా సర్వీస్ చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వం కూడా తమను పట్టించుకోవడం లేదన్నారు. కావున పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం రూ.22,750 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీతభత్యాలు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలని, కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, టిఎ, డిఎ సౌకర్యం కల్పించాలని అన్నారు. ట్రోయ్ పిఆర్సిలో కనీస వేతనం రూ.35,000లతో పాటు, పాత విధానాన్ని రద్దు చేయాలని, 16 సంవత్సరాల నుంచి పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్రలను తిరిగి పిహెచ్‌సిలో నియమించాలని, ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డ్ సౌకర్యం కల్పించాలని లేనియెడల సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.

పాఠశాలకు పారిశ్రామికవేత్త దయానంద్‌రెడ్డి చేయూత

- రూ.50 వేల విలువైన క్రీడా సామగ్రి అందజేత


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దయానందరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానందరెడ్డి తనవంతుగా రూ.50వేల క్రీడా సామగ్రిని అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజనోపాధ్యాయుడు శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి విద్యార్థుల కోసం క్రీడా సామగ్రిని ఉపయోగించుకుని విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలలో రాణించే విధంగా చూడాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు అశోక్, తాజా మాజీ ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్, ఉపాధ్యాయులు వేమ, రాజ్ కుమార్‌తోపాటు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదకై రక్షణ చర్యలు చేపట్టాలి

- ఓ వ్యక్తిపై కోతుల దాడి



నవతెలంగాణ-ముప్కాల్
మండల కేంద్రంలోని ఎస్సి కాలనీకి చెందిన బుర్కల భూమన్న తన ఇంటి వద్ద స్వంత పనులను చేసుకుంటున్న సందర్భంలో శనివారం ఉదయం కోతులు ఒక్కసారిగా అతనిపై దాడికి దిగాయి. దీంతో అతనికి గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని దగ్గరలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కోతుల బెడద వల్ల గ్రామంలో బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందని ఎస్సి కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కోతులు ఎక్కువగా ఉండడంతో గ్రామస్తులు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, పిల్లలతో వెళ్లాలంటే ధైర్యం చాలడం లేదని వాపోయారు. అధికారులు కోతుల బెడద లేకుండా తగు రక్షణ చర్యలు చేపట్టి గ్రామంలో కోతులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

మొక్కలను సంరక్షించాలి

- ప్లాంటేషన్‌ను సందర్శించిన ఎంపిడిఓ అనంత్‌రావు



ప్లాంటేషన్‌ను సందర్శిస్తున్న ఎంపిడిఓ

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీలో భాగంగా నెలకొల్పిన ప్లాంటేషన్లలో ఉన్న మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో అనంత్ రావు అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాంసాగర్ తండాను ఆకస్మికంగా సందర్శించారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా ప్లాంటేషన్లో 3700 మొక్కల స్థితిగతులను ఏపీఓ ఒడ్డెం పోశెట్టిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్లాంటేషన్‌లో జామ, నిమ్మ, సీతాఫల్, దానిమ్మ, చింతతో పాటు పూల మొక్కలను పెంచుతున్నట్టు వివరించారు. సిర్నాపల్లి నుంచి రామ్‌సాగర్ తాండవరకు రహదారికి ఇరువైపులా కొబ్బరిచెట్లు 260 నాటడంతో నేడు అవి పెద్దవై ఆహ్లాదకరంగా కనబడుతున్నాయన్నారు. ఇలాగే ప్రతిచోటా అవెన్యూ ప్లాంటేషన్లలో మొక్కలు నాటే విధంగా చూస్తామన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం తాండలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రుద్రూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులు చేపట్టాలి


బురదమయంగా మారిన రోడ్డు వద్ద నాయకులు

నవతెలంగాణ-వర్ని
రుద్రూర్ మండల కేంద్రం బస్టాండ్ చినుకు పడితే చిత్తడిగా మారుతూ ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతుందని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి బస్టాండ్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఏండ్లుగా బస్టాండ్ దుస్థితి మారడం లేదన్నారు. బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి అంటూ చెప్పే మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఒక సారి రుద్రూర్ బస్టాండ్ పరిస్థితి చూడాలని అన్నారు. ప్రయాణికులకు మరుగుదొడ్లు, టాయిలెట్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, మంచి నీళ్ల కూడా ప్రయాణికులకు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, రాజాం, ప్రయాణికులు తదితరులున్నారు.

నిర్విరామ సేవలకు ప్రశంసపత్రం


ప్రశంసపత్రం అందుకున్న అంగన్వాడీ సూపర్‌వైజర్

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని పిప్రి గ్రామ సెక్టార్ పరిధిలో అంగన్వాడి సూపర్వైజర్‌గా విధులు నిర్వర్తించి అర్బన్‌కు బదిలీపై వెళ్లిన సూపర్వైజర్ వెంకట రమణమ్మను ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఉత్తమ సేవలకు గాను జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారిని రసూల్ బి ఆదేశానుసారం అంగన్వాడి కేంద్రాల యందు టీచర్లకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్


సూచనలిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నీటి కలుషితం వలన కలిగే టైఫాయిడ్ వ్యాధి, దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ చికెన్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇందల్‌వాయి ఆసుపత్రి ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ ఆరోగ్య ఉప కేంద్రం సంబంధించిన గొల్లపల్లి గ్రామంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరంలో ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ పాల్గొని మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నీటి కలుషితం వలన కలిగే టైఫాయిడ్ వ్యాధి, దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ చికెన్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగాలని, జ్వరం రాగానే ఆరోగ్య సిబ్బంది వద్దకు వచ్చి మందులు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా రోగులందరికీ ఉచిత రక్త పరీక్షలు, మందులు డాక్టర్ నవత ఆధ్వర్యంలో అందజేశారు. తదనంతరం గొల్లపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వరం సర్వే నిర్వహించారు. జ్వరం వచ్చిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సిబారాణి, ఆశా కార్యకర్తలు స్వప్న, రుక్సానా, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

- ఇద్దరి అరెస్ట్.. బైండోవర్


తహసీల్దార్ ముందు ఇద్దరి బైండోవర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
భీమ్‌గల్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు మాధవ్ ఆధ్వర్యంలో ఇందల్‌వాయి మండలంలోని పలు తండాలపై దాడులను నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేసి ఇందల్‌వాయి తహసీల్దార్ వెంకట్రావు ముందు బైండోవర్ చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుమాధవ్ తెలిపారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని డోంకల్, వెంగళ్‌పాడ్, దేవితండాలో భీమ్‌గల్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ నిజామాబాద్, ఏసి ఎన్‌ఫోర్స్‌మెంట్‌ల ఆధ్వర్యంలో తాండలపై మెరుపు దాడులు నిర్వహించగా ధూమ్కల్ తిన్న మూడవత్ సోమ్లి, వెంగళ్‌పాడ్‌కు చెందిన భదవత్ విఠల్‌ను అదుపులోకి తీసుకొని వారిద్దరిని అరెస్టు చేసి తహసీల్దార్ వెంకట్రావు ముందు బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో భీంగల్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ ఫయాజ్ పఠాన్, సిబ్బంది దత్తు, మహేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితులను బహిరంగంగా శిక్షించాలి

- సిపిఐ డిమాండ్


మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
లైంగికదాడి నిందితులను బహిరంగంగా శిక్షించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైల్వేస్టేషన్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు కే.భూమయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. కలకత్తా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మౌమితపై సభ్య సమాజం తలదించుకునే విధంగా అత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా శిక్షించాలని పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై సిబిఐ విచారణ జరిపి బాధ్యులైన ప్రతి ఒక్కరికి బహిరంగ శిక్ష వేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. వైద్య విద్యార్థిని కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకొని న్యాయం చేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసన శిబిరాన్ని సందర్శించి సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వై.రాజిరెడ్డి, కె.రాజన్న, ఎం.స్వరూపారాణి, రాందాస్, రఘురాం, అంజలి, ఆలీ ఇమ్రాన్, ఫెరోజ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి..
గత 4 రోజుల కిందా పశ్చిమబెంగాల్ రాష్ట్రం ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ మహిళపై లైంగికదాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్లు గత మూడు రోజుల నుంచి నిరసన కార్యక్రమం చేస్తున్నారు. అందులో భాగంగా వారి న్యాయమైన పోరాటానికి ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రఘురాం మద్దతు తెలిపారు.

బోధన్ బంద్ ప్రశాంతం


మూసి ఉన్న షాపులు

నవతెలంగాణ-బోధన్
బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందు ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం బోధన్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు నిర్వహించారు. పలుచోట్ల నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కమ్మర్‌పల్లిలో పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఐ(ఎంఎల్) నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
కాంగ్రెస్ పార్టీ గత తొమ్మిది నెలల క్రితం ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు సారా సురేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, 420 సమస్యలను పరిష్కారిస్తామని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. నేటికీ ఏ ఒక్కటి కూడా సరిగ్గా అమలు జరపలేని పరిస్థితిలో కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని, ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇస్తామని, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇస్తామని, బీడీ కార్మికులందరికీ జీవనభృతి రూ.4016, రైతులందరికీ సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని, మహిళలందరికీ గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తామని, ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు ఇస్తామని హామీనిచ్చి నెరవేర్చలేదన్నారు. మహిళలందరికీ ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చి, బస్సుల సంఖ్య పెంచకుండా ఫ్రీ బస్సులు పెట్టడం వల్ల స్త్రీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలను అమలు చేయాలని, రెండు లక్షల రుణమాఫీ ఎలాంటి నిబంధన లేకుండా అమలు చేస్తామని చెప్పి, అనేక కొర్రీలు పెడుతున్నారని, సాంకేతిక లోపాలున్నాయని చెప్పి వాటి అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. వంద రోజులలో అమలు చేస్తానన్న సమస్యలన్నీ అమలు చేయాలని, తక్షణమే పోడు భూముల సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీటికి పరిష్కార మార్గం పోరాట మార్గమే ఏకైక మార్గమని ప్రజానీకానికి గుర్తు చేస్తున్నామన్నారు. పోరాటం చేయకుండా ఏ సమస్య కూడా పరిష్కారం కాదని, పాలకుల కండ్లు తెరిపించవలసిన అవసరం ఉందన్నారు. ఈనెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా మండల కార్యదర్శి బి.అశోక్, పార్టీ మండల నాయకులు వి.బాలయ్య, టి.బాలకిషన్, పెద్ది రాజేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లల్లో రాఖీ వేడుకలు


ధర్పల్లి: రాఖీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు

నవతెలంగాణ-ధర్పల్లి/సిరికొండ
మండలంలోని దుబ్బాక గ్రామంలోని శ్రీ విద్య పాఠశాలలో రాఖీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోజూరి సాయికృష్ణ మాట్లాడుతూ.. అక్క-తమ్ముళ్ల అన్నా-చెల్లెళ్ల మధ్య ఆప్యాయతే ఈ రాఖీ పండుగ అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోజూరి నడ్పి గంగాధర్, ఉపాధ్యాయులు మనోజ్ఞ, మమత, లత, రాధా, రసజ్ఞ, ఇందిరా, భువనేశ్వరి, మీనా, రష్మిత, సుధా, శిరీష తదితరులు పాల్గొన్నారు.


సిరికొండలో..

సిరికొండ :మండలంలోని కిడ్స్‌పార్క్ స్కూల్లో రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆనందంతో రాఖీలు కట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రాఖీలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిదంగా పలువురు గ్రామస్తుల వద్దకు వెళ్ళి స్వయంగా విద్యార్థులు రాఖీ కట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. అనుబంధాలను పంచుకునే పండగ రక్షాబంధన్ అన్నారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెండ్ల అన్యోన్యతను చిహ్నం ఈ పండగ అని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆసిఫ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావిద్యార్థి సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

- ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ప్రజావిద్యార్థి సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని ఏఐకేఎంఎస్ (అఖిల భారత రైతు కూలీ రైతు సభ) జాతీయ నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతుకూలీ రైతు సభ జాతీయ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు 40లక్షల మంది ఇండ్ల స్థలాలు లేక, ఇండ్లు కట్టుకునే స్థోమత లేక, సొంత ఇంటి కళ నెరవేర్చడానికి ఏ ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి ప్రజల సమస్యలను ఇండ్ల సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయన్నారు. ఏండ్లు గడిచినా ఈ సమస్యకు పరిష్కారం చూపడం లేదని తెలిపారు. ఇప్పటికే ఇండ్ల స్థలాల కోసం పక్క ఇండ్ల నిర్మాణాల కోసం, ప్రభుత్వాలకు ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. మరోవైపు లక్షలాది మంది ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా అనేక పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వం భూముల్లో గుడిసెలు వేసుకొని నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆ స్థలాలను కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా పక్క ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని ఏఐకేఎంఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కలకత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను నివారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కత్తుల మారుతి, పల్ల మల్లేష్, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు దత్తు, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
ఆదివారం | ఆగస్టు 18, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

- డీఈవో రాజు

నవతెలంగాణ-రామారెడ్డి

సీజనల్ వ్యాధుల దృష్ట్యా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో శనివారం ఆకస్మికంగా సందర్శించారు. స్టాక్ రూమ్, వంటగది, బాత్రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద అభివృద్ధిని చూసి సంతోషించారు. పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలను గ్రామపంచాయతీ సహకారంతో తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం ఈ ఓ యోసేపు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

దోమకొండ పట్టణ బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-దోమకొండ

బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులకు నిరసనగా దోమకొండలో హిందూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులపై ఐక్యరాజ్యసమితి జోక్యం తీసుకొని బంగ్లాదేశ్ లోని హిందువులను రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ శాఖ సంఘం సభ్యులు కదిరి లక్ష్మారెడ్డి కదిరి మోహన్ రెడ్డి, తిప్పని సిద్ధ రాములు మద్దూర్ భూపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పున్న లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్ తదితరులుపాల్గొన్నారు.


ర్యాలీ చేపట్టిన పలువురు

వైద్యులకు రక్షణ కల్పించండి

- వైద్యవిద్యార్థిపై లైంగికదాడి, హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన నిరసనలు

నవతెలంగాణ-కామారెడ్డి

కలకత్తా ఆర్‌జీకేఏఆర్ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మహిళా (పీజీ ఇన్ పొల్మొనరీ డిపార్ట్మెంట్)పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఏ నిజామాబాద్ యూనిట్) తీవ్రంగా ఖండిస్తుందనీ, నిందితులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యులందరూ ర్యాలీగా బయలుదేరి ఇందిరా గాంధీ చౌక్ వద్దకు చేరుకొని మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఎస్ఆర్డిఎ, జూడ సంఘాల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ కే.బన్సీలాల్, కోశాధికారి డాక్టర్ రాజ గౌడ్, ప్రభుత్వ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.


భిక్కనూర్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న స్థానికులు

అంబేద్కర్ విగ్రహం వద్ద వైద్య సిబ్బంది నిరసన

బిచ్కుంద : బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తమ విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి ఫ్లకార్డులతో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఆసుపత్రులలో పని చేసే సిబ్బందికి రక్షణ కల్పించాలంటు వినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వైద్యులు భరత్ మాట్లాడుతూ వైద్యులు పనిచేస్తున్న పరిసరాల్లో భద్రత కరువైందని ముఖ్యంగా మహిళా వైద్యులు మహిళా సిబ్బంది హింసకు గురవుతున్నారని అన్నారు. వైద్య వృత్తిలో ప్రజలకు 24 గంటలు సేవ చేస్తున్న వైద్య సిబ్బందికి ప్రభుత్వం రక్షణ కల్పించానీ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందేందుకు దోహదపడతాయని అన్నారు. ఆయన వెంట బిచ్కుంద ప్రభుత్వాసుపత్రి సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినిలకు రక్షణ కల్పించాలి

బాన్సువాడ (నసురుల్లాబాద్) : బాన్సువాడ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, లెక్చరర్లు కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. మెడికల్ కళాశాలల్లో విద్యార్థు లకు తగిన రక్షణ కల్పించా లని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళనలు దేశవ్యాప్తంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థినిలు, సిబ్బంది, ధతదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆస్పత్రి సూపరింటెడెంట్ రవీంద్ర మోహన్ ఆధ్వర్యంలో వైద్యులు ఉదయం 10గంటల నుండి11 గంటల వరకు గంటపాటు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు ఆటంకం కాకుండా నిరసన వ్యక్తం చేశారు. వైద్యులపై దాడులు సరికాదని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు స్టాఫ్ నర్సులు సెక్యూరిటీ శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలతో నిరసన

రామారెడ్డి : రామారెడ్డి పిహెచ్సిలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ మాట్లాడుతూ... ఘటనను ఖండిస్తున్నామని, దోషులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురావాలని సూచించారు.



కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో..

కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : భిక్కనూరు పట్టణంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యుల జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మహిళా డాక్టర్ హత్య చేసిన నిందితుడిని బహిరంగంగా ఉరితీయాలని ఇందుకు నిరసనగా రెండు గంటలపాటు ప్రథమ చికిత్స సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు సుదర్శన్, గంగాధర్, దయాకర్ రెడ్డి, ఆంజనేయులు, తేజస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులు

భీంగల్ : భీంగల్ పట్టణ కేంద్రంలో శ్రీ శివ సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సాయికుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించారు. దేశంలో ప్రతినిత్యం ఎక్కడో చోట డాక్టర్లపై దాడులు చోటుచేసుకుంటున్నాయని కనుక ప్రభుత్వం స్పందించి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డాక్టర్ సాయికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


బిచ్కుందలో అంబేద్కర్ విగ్రహం ఎదుట వైద్య సిబ్బంది నిరసన..


బాన్సువాడలోని నర్సింగ్ కాలేజీ విద్యార్థుల నిరసన..


ఎల్లారెడ్డిలో నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యుల నిరసన..


భీంగల్‌లో శ్రీ శివసాయి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో

పేకాట స్థావరంపై పోలీస్‌ల దాడి

- మాజీ ఎంపీపీ భర్తతో పాటు పలువురిపై కేసు నమోదు

నవతెలంగాణం-పిట్లం

పేకాట స్థావరంపై పోలీస్‌లు దాడులు చేసి, మాజీ ప్రజాప్రతినిధులను అరెస్టు చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి అందాజా 12 గంటల సమయంలో మండల కేంద్రంలోని బాలాజీ రైస్‌మిల్‌లో గత కొంతకాలంగా పేకాట నిర్వహిస్తున్నారనే పక్క సమాచారంతో ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌నాయక్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అధిక మొత్తంలో రూ.2 లక్షల 4వేలు, 5 కార్లు, ఒక బైక్ 10 సెల్‌ఫోన్‌లు స్వాధీనం పరుచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పేకాటలో పట్టుబడిన వారిలో పిట్లం మాజీ ఎంపీపీ భర్త భోగం విజయ్, పెద్ద కోడప్‌గల్ మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నట్లు సమాచారం.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

డెంగ్యూ బాధితునికి ప్లేట్ లెట్స్ అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన సంతోష్ రెడ్డి హైదరాబాదులోని యశోద వైద్యశాలలో డెంగ్యూ వ్యాధితో చికిత్స పొందుతున్న సతీష్ (48)కి అత్యవసరంగా ఓ పాజిటివ్ ప్లేట్ లెట్స్‌ను సకాలంలో అందజేసి ప్రాణదాతగా నిలిచినట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని వారికి సకాలంలో ప్లేట్ లెట్స్ అందజేస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు.

బిఎడ్ కాలేజీ ప్రిన్సిపల్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అహ్మద్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న హనీఫ్ పాషా జంతు శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు. కామారెడ్డి కి చెందిన హనీఫ్ పాషా సన్రైజ్ విశ్వ విద్యాలయంలో జంతు శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించారు. "ఎనలైటికల్ స్టడీ ఆన్ డెవలప్మెంట్ అఫ్ ఫిష్ బయోడైవర్సిటీ అండ్ హేబిటేట్ ఎకలజీ " అనే అంశంపై డాక్టర్ దీపిక వాట్స్ పర్యవేక్షణలో పరిశోధనలు చేసి యూనివర్సిటీలో సమర్పించారు. వాటిని పరిశీలించిన యూనివర్సిటీ అధికారులు అతనికి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. తనకు డాక్టరేట్ రావడానికి పూర్తి సహకారం అందించిన యూనివర్సిటీ అధికారులు, కుటుంబ సభ్యులకు, గురువులకు, మిత్రులకు ఎంతో రుణపడి ఉంటానాని హనీఫ్ పాషా తెలిపారు. జంతు శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు, కళాశాల సిబ్బంది హనీఫ్‌ని అభినందించారు.

ఏసీబీకి పట్టుబడ్డ కార్యదర్శి కేసులో విచారించిన డిపిఓ తరుణ్ కుమార్

నవతెలంగాణ-ధర్పల్లి

సుమారు గత పది సంవత్సరాల క్రితం ధర్పల్లి పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అప్పటి గ్రామ కార్యదర్శి సంధ్యారాణి ఒక కేసులో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కాగా అట్టి కేసు నేడు హియరింగ్ ఉండటంతో శనివారం డిపిఓ తరుణ్ కుమార్, ఏసీబీ ఇన్స్పెక్టర్ నగేష్ ఉమ్మడిగా విచారణ చేసేందుకు ధర్పల్లి పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వర్షాలు కురవడంతో గ్రామాల్లో జ్వరాలు రావడం వల్ల ఉచిత వైద్యం నిర్వహించారు. సీజనల్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మారుతి రావు, అయిషా యస్.యచ్.ఓ నాగరాజు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విజయ్ కొండకు ఎన్ఎస్‌యుఐ డోంగ్లి మండల అధ్యక్షులు సుధీర్ కుమార్ శనివారం సన్మానించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మీ సేవలు అమూల్యమైనవని ప్రజా సమస్యల పరిష్కారానికి న్యాయపరంగా కృషి చేయాలని ఎస్సైని కోరారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

నాగిరెడ్డి పేట మండలంలోని పోచారం గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాల లో విధులు నిర్వర్తించి ఇటీవలే బదిలీ అయిన ఉపాధ్యాయులకు గ్రామ మాజీ సర్పంచ్ విజిత శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీ అయినా రాములు, రాజమణి, అనురాధ, సుమిత్ర, మీరాబాయిలకు సన్మానం నిర్వహించారు.

అధికారులకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారి

నవతెలంగాణ-బిచ్కుంద

సోదరభావానికి ప్రత్యేకగా నిర్వహించుకునే రాఖీ పండగ పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసిల్ కార్యాలయంలో బిచ్కుందకు చెందిన ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీలు డిప్యూటీ తహసిల్దార్ క్రాంతి కుమార్, ఆర్ ఐ రవీందర్, ఇతర సిబ్బందికి రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావాన్ని పెంపొందించే పండగే రాఖీ పండగ అని అన్నా, చెల్లి, అక్క, తమ్ముడు ఒకరికొకరు రక్షణగా ఉంటూ సోదరభావంతో ఒకరికొక రక్షణ గా ఉండాలని భారతదేశ సంస్కృతిలో గొప్ప పండుగ రాఖీ పండుగ అని డిప్యూటీ తాసిల్దార్ క్రాంతి కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్ సిబ్బంది ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ తిరిగి అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఓ వ్యక్తి పోగొట్టుకున్న తన సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని బాధితుడికి శనివారం అందించినట్లు ఎల్లారెడ్డి ఎస్ ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గుంటిగారి సురేందర్ తన ఫోన్ ఎల్లారెడ్డిలో ఏప్రిల్ 24 నాడు పోగొట్టుకున్నట్లు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఇటీవల సెల్ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకొని అందజేసినట్టు తెలిపారు.


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

ప్రశంసపత్రం పట్ల హర్షం

నవతెలంగాణ-మద్నూర్

ఉత్తమ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవలు పురస్కారం అందించడం మీ సేవలు అమూల్యమైనవని, మండల రేషన్ డీలర్లు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎండి ముజీబ్‌కు సీట్లు తినిపించారు. తసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించే హనుమంతుకు ఉత్తమ సేవల పురస్కారం అందించడం పట్ల రేషన్ డీలర్లు కార్యాలయంలో తహసీల్దార్‌కు అటెండర్‌కు సీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న రేషన్ డీలర్లు రమేష్ దేశాయ్, వామన్ రావు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు స్వీట్ తినిపిస్తున్న రేషన్ డీలర్‌లు

చనిపోయిన ఆవును రోడ్డుపక్కన పడేసిన వ్యాపారులు

అంత్యక్రియలు నిర్వహించిన స్థానికులు

నవతెలంగాణ-మద్నూర్

గుర్తుతెలియని వ్యాపారులు అక్రమంగా ఆవులను తరలిస్తూ, చనిపోయిన ఆవును మండలంలోని మేనూర్, శాఖాపూర్, గ్రామ శివారు ప్రాంతంలో 161వ జాతీయ రహదారి పక్కన వదిలేశారు. రోడ్డు పక్కన పడి ఉన్న ఆవులను చూసి ఒక ఆవు చనిపోయినట్టు మేనూర్ గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం మేరకు ఎస్సై విజయ్ కొండ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన ఆవుకు మెనూర్ గ్రామ పెద్దలు, వై.గోవింద ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

- వర్షానికి నీటమునిగిన కాలనీల్లో చైర్‌పర్సన్ పర్యటన

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీగా వర్షం కురిసిన ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి సందర్శించారు. శుక్రవారం సాయంత్రం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షం కారణంగా జేపీఎన్ రోడ్, హౌజింగ్ బోర్డు కాలనీ, బతుకమ్మ కుంట ప్రాంతాలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీంచారు. వర్షం వల్ల కాలనీ వాసులు పడ్డ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పలు ఇండ్లలోకి వర్షం నీరు రావడంతో ఆ ఇంటి యజమానులతో కలిసి మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా చేయాలనీ పలువురు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందు ప్రియా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షం నీరు ఇళ్లలోకి, షాప్స్ లోకి రాకుండా చూడా లని ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీ నీరు నిలువకుండా చూసుకోవా లని మున్సిపల్ సిబ్బందినీ ఆదేశించారు. కార్యక్రమంలోని, మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


లోతట్టు ప్రాంతాలు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

పెండింగ్ స్కాలర్షిప్ విడుదల చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ బిసివే ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లపైనే విద్యార్థులను ప్రయివేటు కళాశాలలు చేర్చుకున్నాయని, కానీ ప్రస్తుతం నిధులు విడుదల కాకపోవడంతో ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తున్నట్టు తెలిపారు. బకాయిలు విడుదల చేసి పేద మధ్యతరగతి విద్యార్థులకు అండగా నిలవాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి శివ ప్రసాద్ రణధీర్ ఎల్. సంపత్ పి జస్వంత్ సన్నీ జ్ఞానేశ్వర్ విష్ణు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జేఎల్‌ఎంలకు ప్రమోషన్లు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలో ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న జేఎల్‌ఎం లకు ప్రమోషన్లు వచ్చినట్టు ఏఈ మనోరంజన్ శనివారం తెలిపారు. నాగిరెడ్డిపేట్ మండలం లోని ఆత్మకూర్ లో విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ మాసన్పల్లిలో విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ జాన్కంపల్లి లో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ నాగిరెడ్డిపేట్ లో విధులు నిర్వహిస్తున్న కృష్ణకు జేఎల్‌ఎం నుండి ఏఎల్‌ఎంగా ప్రమోషన్లు రాగా వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడి సుదర్శన్ రెడ్డి, లైన్ ఇన్స్‌పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ శశికాంత్ రెడ్డి ఉన్నారు.


నియామకపత్రాలు అందజేత

భూమి అమ్ముకున్న వృద్ధురాలిపై రూ.6.40 లక్షల రుణం

- 10 గుంటల భూమి అమ్మితే 1.07 ఎకరాల రిజిస్ట్రేషన్
- ఒకే సర్వే నెంబర్‌పై అనేక బ్యాంకుల్లో రుణాలు
- చక్రం తిప్పిన మాజీ ఎంపీపీ
- ఇటీవల నోటీసులు రావడంతో మోసాలు వెలుగులోకి
- రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టట్లే
- న్యాయం చేయాలని భిక్కనూర్‌లో ధర్నా చేసిన బాధితులు

నవతెలంగాణ-భిక్కనూర్

లక్ష రూపాయల రుణం ఇచ్చేందుకు సవాలక్ష కొర్రీలు పెట్టే బ్యాంకులు.. ఓ వృద్ధురాలి పేరుపై ఏకంగా 6.40 లక్షల రూపాయల పంట రుణం మంజూరు చేశాయి. ఆ రుణం క్షణాల్లో మరొకరికి బదిలీ చేసిన ఉదాంతం ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. కాగా సదరు వృద్ధురాలు ఆ భూమిని గతంలోనే విక్రయించడం గమనార్హం. బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో సదరు వృద్ధురాలు ఆందోళనకు గురై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా వారు పట్టించుకోవడం లేదని వాపోతూ భిక్కనూర్‌లో శనివారం ధర్నా చేపట్టింది. బాధితుల కథనం ప్రకారం..

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మి మనమరాలి పెళ్లికి గ్రామానికి చెందిన సుదర్శన్ వద్ద 2014 సంవత్సరంలో 80 వేల రూపాయలు అప్పు తీసుకున్నారు. 2015 సంవత్సరంలో అప్పు కింద 10 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేయాలని సుదర్శన్ ఒత్తిడి తీసుకురావడంతో 10 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. కానీ వృద్ధురాలికి తెలియకుండా మాయమాటలు చెప్పి 1 ఎకరా 7 గుంటలు భూమి రిజిస్ట్రేషన్ చేసుకు న్నారు. 2016 సంవత్సరంలో అమ్ముకున్న భూమిపై 40 వేల రూపా యలు భిక్కనూర్ సహకార బ్యాంకులో, 2017 సంవత్సరంలో పెద్ద మల్లారెడ్డి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 1 లక్ష 20 వేల రూపాయలు, అలాగే లక్ష్మి కొడుకు ఎల్లయ్య భూమిపై 2017 సంవత్సరంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 1 లక్ష 50 వేల రూపాయలు, కుటుంబీకుల మరో సర్వే నెంబర్ పై 1 లక్ష 88 వేల రూపాయలు మొత్తం అమ్మిన భూమి, కుటుంబ సభ్యుల భూమిపై కుటుంబీకుల తెలియకుండా 6 లక్షల 40 వేల రూపాయలు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సుదర్శన్ మంజూరు చేసుకొని వారి కుటుంబ సభ్యులకు నగదు బదిలీ చేసుకున్నట్లు బాధితురాలి మనుమడు నితీష్ తెలిపారు.

కుటుంబీకులకు తెలియకుండా రుణాలు మంజూరు చేసుకుని వారి కుటుంబ సభ్యులపై బదిలీ చేసుకొని డబ్బులు కట్టకపోవడంతో బ్యాంక్ అధికారులు బాధితుల ఇంటి వద్దకు వచ్చి రుణాలు చెల్లించాలని నోటీసులు ఇవ్వగా రుణాల విషయం బయటకు వచ్చింది. విషయంపై కుటుంబీకులు సుదర్శన్‌తో మాట్లాడగా మొదటగా బ్యాంకు అధికారులతో మాట్లాడతానని చెప్పి బ్యాంకు అధికారుల ఒత్తిడి కారణంగా మరోసారి సుదర్శన్ తో మాట్లాడితే మీకు నచ్చింది చేసుకోండి అని బాధితులపై దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. విషయాన్ని రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయకపోవడంతో జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. న్యాయం కోసం బాధితులు పోలీస్ స్టేషన్, రెవెన్యూ జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయ చుట్టూ తిరిగిన న్యాయం జరగకపోవడంతో శనివారం బిక్కనూర్ పట్టణ కేంద్రంలో కుటుంబీకులు ధర్నా నిర్వహించారు.

అమ్ముకున్న భూమిపై బాధితులకు తెలియకుండా బ్యాంక్ అధికారులు ఎలాంటి విచారణ చేయకుండా 6 లక్షల 40 వేల రూపాయలు రుణాలు ఎలా మంజూరు చేశారని, నిరుపేద కుటుంబానికి చెందిన రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిన మంజూరు కానీ రుణాలు రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులకు ఎలాంటి దర్యాప్తు, విచారణ చేయకుండా ఏ విధంగా రుణాలు మంజూరు చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. అన్యాయం చేసి 10 గుంటల భూమి అమ్ముకుంటే మొత్తం భూమి కాజేసిన వ్యక్తిపై, అమ్మిన భూమిపై విచారణ చేయకుండా రుణాలు మంజూరు చేసిన బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.


బ్యాంకు నోటీసులు, అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులు చూపుతున్న బాధితులు

ఏసీపీ కార్యాలయంలో కూలిన ప్రహరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శనివారం ఉదయం నిజామాబాద్ నగరంలోని ఏసీపీ కార్యాలయం ప్రహరీ గోడ కూలిపోయింది. అయితే ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా చాలా సంవత్సరాల నాటి గోడ కావడంతో వర్షాలకు కూలిపోయిందని, పాత ఏసీపీ ఆఫీస్‌తో పాటు ప్రహరీ గోడను కూల్చేయాలని గతంలో అధికారులు నిర్ణయించారని పోలీసులు తెలిపారు.



కూలిన ప్రహరీ గోడ

ఇసుక మాయం చేసిన వారిపై కేసు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ఈ నెల 13 న రెవెన్యూ సిబ్బంది రెండవ బ్రిడ్జి దాటిన తర్వాత సీజ్ చేసిన ఇసుక డంపు దాదాపు 18 ట్రిప్పులు ఇసుక అక్రమంగా తీసుకువెళ్లిన పొతంగల్ గ్రామానికి చెందిన గంధపు రాజుపై చట్టపరంగా తగు చర్యలు తీసుకునేందుకు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు తహసీల్దార్ జె. మల్లయ్య తెలిపారు.



సీజ్ చేసిన జేసీబీ

ఘనంగా తీజ్ ఉత్సవాలు



తీజ్ ఉత్సవాలలో పాల్గొన్న యువతులు, మహిళలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో తీజ్ పండుగను గిరిజన శక్తి అధ్యక్షులు శీనునాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవాలాల్ మహారాజ్ వారసుడు రమేష్ మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల్లో ముఖ్యమైన పండుగలో ముఖ్యమైన పండుగ తీజ్ పండగ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పండుగను అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక మాట్లాడుతూ బంజారాలో తెలంగాణ యూనివర్సిటీలో తీజ్ పండుగ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రొఫెసర్ శాంతాదేవి మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు విద్యార్థులకు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన అన్నిరకాల సహాయ సహకారాలు అందించిన ప్రొఫెసర్ కిరణ్ రాథోడ్, ప్రవీణ్ కుమార్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బికోజి నాయక్, నరేష్ నాయక్, మహావీర్, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు సాగర్ నాయక్, శ్రీనివాస్‌నాయక్, శ్రీకాంత్, మోహన్, చందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్మ సంతోష్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. రాఖీ పండుగ సోదరీ సోదరుల ప్రేమానురాగాలకు ప్రతీక అని, రక్షాబంధన్ పండుగను ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న విద్యార్థినిలు

మండల వ్యవసాయ అధికారిణిగా లావణ్య

నవతెలంగాణ-బాల్కొండ

మండల వ్యవసాయ అధికారినిగా బద్దం లావణ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన వ్యవసాయ శాఖ అధికారుల బదిలీల్లో లావణ్య మోర్తాడ్ మండలం నుంచి బాల్కొండ మండలానికి బదిలీ అయ్యారు. బాల్కొండ మండల వ్యవసాయ అధికారిగా ఇదివరకు పనిచేసిన మహేందర్‌రెడ్డి నిజామాబాద్ అర్బన్ వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు. నూతన వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఎల్లప్పుడూ వ్యవసాయ సలహాలు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. రైతులకు వ్యవసాయ శాఖ తరపున సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని పేర్కొన్నారు.



ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రక్షాబంధన్



పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్త ప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నైతిక విలువలు నేర్చుకోవాలని, దేశభక్తి కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. "నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష" అనే సందేశాన్ని ఇచ్చి విద్యార్థినుల చేత విద్యార్థులకు రాఖీలు కట్టించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరోద్దీన్, ప్రవీణ్ శర్మ, ప్రసాద్, పవన్, రాజశేఖర్, రాజనర్సయ్య, రాజేందర్, శ్రీనివాస్, గంగాధర్, జ్యోతి, సమతా పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాల విద్యార్థులకు కమ్మర్‌పల్లికి చెందిన చింత ప్రదీప్ తన తండ్రి చింత బలరాం జ్ఞాపకార్థం నోట్ పుస్తకాలను మండల విద్యాధికారి ఆంధ్రయ్య చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింత ప్రదీప్ మాట్లాడుతూ.. తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రదీప్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి కుమార్, సీఆర్పీలు అంజయ్య, రాజేష్, లలిత, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు

- రైతులను మోసం చేసే ప్రయత్నం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తప్పుడు ప్రచారాలతో బీఆర్ఎస్ పార్టీ రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రజా ప్రభుత్వం వచ్చిందని ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ విజయంతో ముందుకు వెళ్తుందని, అది చూసి తట్టుకోలేక కేటీఆర్, హరీష్‌రావు అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. రైతు రుణమాఫీపైన కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన జీవో విడుదల చేసిందని అందులో భూమి ఉండి దానిపై రుణం తీసుకున్న కుటుంబానికి 2లక్షల చొప్పున రుణమాఫీ చేస్తామని తెలిపిందని వివరించారు. అందులో భాగంగానే మొదటి విడతగా లక్ష రూపాయలు, రెండో విడతలో లక్షన్నర వరకు, మూడో విడతగా రెండు లక్షల రూపాయలు మాఫీ చేసిందని అన్నారు. ఏ రాష్ట్రం కూడా ఇప్పటి వరకు రుణమాఫీ ఇంతలా చేయలేదని, కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని ఆయన అన్నారు. రుణమాఫీ చేయడంలో ఎక్కడ కూడా అవినీతి జరగలేదని, రుణం మాఫీ కాని వారికోసం ప్రత్యేకంగా వ్యవసాయ అధికారులను నియమించినట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన 5 సంవత్సరాలలో రేషన్ కార్డు ఇవ్వలేదని, రేషన్ కార్డు లేనివారికి రుణమాఫీ కాలేదని, అదేవిధంగా వివరాలు ఎవరైనా తప్పుగా ఉంటే వారికి మాఫీ అవ్వలేదని వీటన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో పూర్తిగా చూడకుండా అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా సొసైటీ బ్యాంక్‌లు, కోడ్ బ్యాంకింగ్‌తో లింక్ లేకపోవడం వల్ల వారికి మాఫీ కాలేదని, వీటన్నింటి కూడా ప్రభుత్వం నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ ద్వారా పరిష్కరిస్తామని, ప్రభుత్వం దాదాపు ఇరవై లక్షల కుటుంబాలకు రైతు రుణమాఫీ చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పరిపాలించి ప్రజలకు ఏమి చేయలేదని, ఇప్పుడు ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందని, రైతులు ఆనందంగా ఉన్నారని తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ధర్నాలు చేస్తున్నారని, మతి స్థిమితం లేకుండా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రైతులకు రుణమాఫీ చేయించే విధంగా వారి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారని, హరీష్ రావుకు సిగ్గు వుంటే వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. గతంలో పది సంవత్సరాలలో రైతుబంధు పేరుతో రోడ్లకు, గుట్టలకు డబ్బులు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, లిక్కర్ స్కాం చేయడం, అవగాహన లేకుండా ప్రాజెక్టులు నిర్మించడం ఇది బీఆర్ఎస్ నాయకుల పని అని ఆయన మండిపడ్డారు. కేసీఆర్‌కు దుర్మార్గపు ఆలోచనలు ఉన్నాయని ప్రజలు కేసీఆర్ మోసాలను గమనించారని ఆయన అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇచ్చామని, 500 గ్యాస్ సిలిండర్ ఇచ్చామని, ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, రైతు రుణమాఫీ చేశామని, త్వరలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇకపైన బుద్ధి తెచ్చుకొని ప్రభుత్వం చేసిన పనులు చూసి కుమిలిపోకుండా ప్రజాసేవలో ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అంతరెడ్డి రాజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సంతోష్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు నరేందర్ గౌడ్, కార్పొరేటర్ రోహిత్, శ్రీనివాస్, గంగారెడ్డి, ఉమ్మాజీ నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తగిన జాగ్రత్తలతో లాభసాటిగా పశుపోషణ

- పశుసంవర్ధక శాఖ ఏడీ గంగాధరయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది పాడి పశువులను కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు పాటించి పశు పోషణను లాభసాటిగా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ ఏడి గంగాధరయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు శనివారం స్థానిక ఐకెపి కార్యాలయంలో ఐకెపి, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పాడి రైతుల అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు గేదెలు, ఆవులకు, కోళ్ల పెంపకం దారులకు రుణాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టడమైందని వివరించారు. ఇందులో భాగంగా పాడి పశువులను, కోళ్లను కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని, తర్వాత కూడా సకాలంలో వైద్య సేవలను పొంది నాణ్యమైన మేతను పశువులకు అందిస్తే ఆశించిన రీతిలో వ్యాపారం లాభసాటిగా జరుగుతుందన్నారు. పశువులను పక్క రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాలని రైతుల ఇష్టం మేరకే ఇతర రాష్ట్రాలలోని నచ్చిన చోట కొనుగోలు చేయవచ్చని తెలిపారు. అయితే కొనుగోలు చేసే సమయంలో పశువుల నాణ్యతను పరిశీలించి ఆరోగ్యవంతమైన పశువులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ రైతులు పశుగ్రాసం కోసం స్థలాన్ని కేటాయించి పశుగ్రాసం సాగుచేయాలని తద్వారా పాడిపశువుల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. వైద్య సేవలు అవసరమైన వారు ఎప్పుడైనా తమను నేరుగా సంప్రదించవచ్చని, సకాలంలో పశువులకు వైద్యం పొంది పశుపోషణ లాభసాటిగా నిర్వహించుకోవాలని సూచించారు. ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్ మాట్లాడుతూ.. మండలంలోని మహిళా సంఘం సభ్యులకు ఎలాంటి వ్యాపారం చేపట్టినా ఒక్కో సభ్యురాలికి ఐదు లక్షలకు మించి కూడా రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ రుణాలను పాడి పశువులు, కోళ్ల పెంపకం వంటి కార్యక్రమాలకు సద్వినియోగం చేసుకొని ఆదాయవృద్ధి పెంపొందించుకోవాలని అన్నారు. పశువుల కొనుగోలు అనంతరం ఆహార శుద్ధి కార్యక్రమాల కింద 35శాతం సబ్సిడీతో రూ.10 లక్షల సబ్సిడీ వరకు రుణాలు అందించే అవకాశం ఉందని దానిని కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ కింద కూడా 50శాతం వరకు పౌల్ట్రీ, మేకలు, గొర్రెల పెంపకం దారులకు పెద్దఎత్తున సబ్సిడీ కార్యక్రమాలు ఉన్నాయని పెంపకం దారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలు విలువైన సూచనలు చేశారు. కార్యక్రమంలో మోర్తాడ్ మండల పశు వైద్యాధికారి డాక్టర్ గౌతమ్‌రాజ్, సీసీలు భలేరావు రవికుమార్, వర్షం శ్రీనివాస్, అలేఖ్య, సిబ్బంది ధనలక్ష్మి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన రైతులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ గంగాధరయ్య

ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓపెన్ స్టడీ సెంటర్ ద్వారా ఓపెన్ పదవ తరగతి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడి మధ్యలో మానివేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవాలని అనుకునే వారికి 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ షెడ్యూలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఆగస్టు 8వ తేదీ నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అపరాధ రుసుముతో సెప్టెంబర్ 11వ తేదీ నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని బడి మధ్యలో మానేసిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సాయన్న కోరారు.

ఓపెన్ పదవ తరగతి దరఖాస్తు కోసం..

పాత పాఠశాలకు సంబంధించి టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్ కానీ లేదా బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, కులం సర్టిఫికెట్, రెండు ఫోటోలు పైవన్నీ మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ ఇంటర్మీడియట్ దరఖాస్తు కోసం..

టెన్త్ మెమో, టీసీ, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలు, పైవన్నీ రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేయాలన్నారు. వివరాల కొరకు 9000358082 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. గత సంవత్సరంలో పరీక్షలు రాసి ఫెయిల్ అయిన వారు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి పరీక్ష ఫీజు చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ గడువు ఉందని, ఆ లోగా విద్యార్థులు స్టడీ సెంటర్ కమ్మర్‌పల్లి యందు ఫీజు చెల్లించాలని ప్రధానోపాధ్యాయులు సాయన్న తెలిపారు.

సెంట్రలైజ్డ్ విధాన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సెంట్రలైజ్డ్ విధాన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 జూన్ 27న రాష్ట్ర ముఖ్యమంత్రి హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ప్రతిపాదనలు సమావేశమై సెంట్రలైజేషన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించిందని తెలిపారు. రెసిడెన్షియల్ పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని వివరించారు. రానున్న కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయాలని సూచించిందని, ఇది సరైనది కాదని, వెంటనే ఆ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని అన్నారు. అలాగే నిలిచిపోయిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధన జాగ్రత్తలపై సూచనలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జీ.వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మినర్సయ్య, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నేర పరిశోధనలో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన చట్టాలను అవలంభించి నేరస్తులకు శిక్షపడేటట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వారి పరిధిలోని పోలీసులకు సలహాలు ఇవ్వాలని డిప్యూటి డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య కోరారు. అదేవిధంగా బదిలీపై వచ్చిన ఎ.కృష్ణవేణి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కామారెడ్డిని సత్కరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి.రవిరాజ్, రాజగోపాల్‌గౌడ్, నంద రమేష్, బంటు వసంత్, ఖాందేష్ శ్రీనివాస్, దామోధర్‌రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేష్‌గౌడ్, మహ్మద్ రహీముద్దీన్, కృష్ణవేణి, చిదిరాల రాణి, జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో బంద్ ప్రశాతం

నవతెలంగాణ-ఎడపల్లి

బంగ్లాదేశ్‌లో ప్రవాస భారతీయులపై అక్కడి ప్రభుత్వం భారతీయ మహిళలు, యువకులను ఆరాచకంగా దౌర్జన్యంగా దాడులు చేస్తూ, మహిళలపై అత్యాచారం, హత్యలు చేయడాన్ని నిరసిస్తూ హిందూ వాహిని, బిజెపి నాయకులు శనివారం మండలంలో బంద్ పాటించారు.

మంగల్‌పాడులో ర్యాలీ..

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడవుల నాగరాజు, కుంట శ్రీనివాస్, గుండ్ల బాబయ్య, శంకర్,తెలుగు గంగాధర్, రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రావుట్ల, నర్సింగ్‌పల్లి గ్రామాలలో వాహనదారులకు హెల్మెట్‌పై ఎస్ఐ ఎల్.రామ్ శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకుండా వాహనదారులకు బయటకు వెళ్లకూడదని సూచించారు.

ప్రశాంతంగా బాల్కొండ బంద్

నవతెలంగాణ-బాల్కొండ

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ జనజాగారణ సమితి పిలుపుమేరకు శనివారం బాల్కొండ మండలంలో ప్రశాంతంగా బంద్ నిర్వహించారు. వ్యాపారస్తులు, దుకాణాలు, హోటల్లు, విద్యాసంస్థలు, పెట్రోల్ బంకులు బంద్ పాటించారు. బంగ్లాదేశ్‌లో ఉన్న హిందువులకు మద్దతు తెలుపుతూ బాల్కొండ మండల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారని ఈ సందర్భంగా హిందూ జన జాగరణ సమితి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాల్కొండ పోలీసుల పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు.

వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ బదిలీ

- ఏడేండ్ల రెండు నెలలు ఏర్గట్లలో విధులు
- భావోద్వేగానికి గురైన మండల ప్రజలు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల వ్యవసాయాధికారిగా సుమారు 7 సంవత్సరాల 2 నెలల పాటు సేవలందించిన అబ్దుల్ మాలిక్ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన సొంత జిల్లా అయిన మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఈయన సేవలందించిన కాలంలో ఏ సమయంలోనైనా ప్రజలకు అందుబాటులో ఉండేవారు. విధుల్లో ఉన్నా. సెలవులో ఉన్నా. రైతులు తమ సమస్యలపై అడిగిన వెంటనే సలహాలు, సూచనలు ఇచ్చేవారు. అలాగే మండలంలోని ప్రజలకు గెజిటెడ్ సంతకం అవసరమైన ప్రతి సందర్భంలో మాలిక్ సార్ గుర్తొచ్చేవారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, విద్యార్థులకు సర్టిఫికెట్‌లపై కాదనకుండా సంతకం పెట్టేవారు. అబ్దుల్ మాలిక్ బదిలీ అయ్యారని తెలిసిన ఏర్గట్ల మండల ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా తమ బాధను వెలిబుచ్చారు. సొంత మనిషే తమ మండలం నుంచి వెళ్లిపోతున్నారని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.



నందిపేట్ ఎస్ఐగా హరిబాబు

నవతెలంగాణ-నందిపేట్

నందిపేట ఎస్సైగా ఎ.హరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమ్‌గల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇదివరకు పనిచేసిన ఎస్సై రాహుల్ బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయొద్దు

నవతెలంగాణ-రెంజల్

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దని బోధన్ రూరల్ సిఐ నరేష్, ఎస్సై ఈ. సాయన్న పేర్కొన్నారు. సిపి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో హెల్మెట్ వాడటం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణం చేస్తే జరిమానా విధిస్తామన్నారు. మైనర్ బాలురకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదని వారు స్పష్టం చేశారు.

రైతుల ఇబ్బందులను పరిష్కరించాలి

నవతెలంగాణ-నవీపేట్

రుణమాఫీలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని బిజెపి మండల అధ్యక్షులు సరిన్ ఆధ్వర్యంలో జన్నేపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ మధును కలిసి శనివారం విన్నవించారు. రైతుల రుణమాఫీలో రేషన్ కార్డులో పేరు లేదని తప్పులు దొర్లాయని చెబుతూ బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని, వెంటనే అటువంటి రైతులకు రుణమాఫీ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదినాథ్, ప్రదీప్ గంగాధర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

రుణమాఫీ ఆంక్షల్లేకుండా రైతులందరికీ అమలు చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ మూడు దఫాలుగా జరిగినప్పటికీ అనేక మంది రైతులకు రాలేదని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎలాంటి అవసరం లేకుండా రుణమాఫీని జరిగేలా చూడాలని ఆయన కోరారు. ముఖ్యంగా సిరికొండ మండల కేంద్రంలో గల సొసైటీ తూంపల్లి సొసైటీలలో రుణాలు తీసుకున్న రైతాంగానికి రుణమాఫీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆన్‌లైన్ చేయకపోవడంతో రైతాంగానికి పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్, మండల నాయకులు ఆర్.దామోదర్ రమేష్, కె.ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
ఆదివారం ఆగస్టు 18, 2024 www.navatelangana.com

చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మోపాల్

బోర్గాం (పి) సొసైటీ పరిధిలో చైర్మన్, ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన రూ.2లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. అలాగే రుణమాఫీ పొందిన లబ్ధి దారులకు మళ్లీ పంట రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన విధంగా ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందని ఇది కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్‌లు, గ్రామ పెద్దలు, సీఈవో కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్టు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లేష్ తెలిపారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ తండా గ్రామ పంచాయతీకి చెందిన బదవాత్ ఉపేంద్ర నాయక్‌ను మంచిర్యాల జిల్లా శ్రీ రాంపూర్‌కు చెందిన నిందితుడు తీగుట్ల మనోజ్ కుమార్ (28) ఉపేంద్ర నాయక్ కు ఫోన్ చేసి మీ పేరు మీద బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ వుందని, వెంటనే ఆ గోల్డ్‌లోన్‌ను క్లియర్ చేయకపోతే మీ గోల్డ్ మొత్తం సీజ్ చేస్తామని చెప్పి బాధితుడిని నమ్మించాడు. దీంతో మనోజ్ కుమార్ మాటలను నమ్మిన ఉపేంద్ర నాయక్ రూ.25000 ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చెయించుకున్నాడు. వెంటనే బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని జరిగిన విషయాన్ని వివరించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన తరువాత నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య అమానుషం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఘటనపై వైద్యుల ఆగ్రహం
- పలు మండలాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆగస్టు 9న కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన సామూహిక లైంగికదాడి, హత్య అమానుషమని పలువురు వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ పలు మండలాల్లో పలువురు వైద్యులు నల్లబ్యాడ్జీలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ అమానుష చర్యకు పాల్పడిన నిందితులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్య అధికారి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ భువన, ఎమ్ఎల్‌హెచ్‌పిలు డాక్టర్ వినీత్, డాక్టర్ అరుణ్, ఆనంద్, అనిత, గంగామని, విజయలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.


బోధన్ : జిల్లా ప్రభుత్వాస్పత్రిలో విధులు బహిష్కరించిన వైద్యులు



నిజామాబాద్‌సిటీ : వెల్‌నెస్ కేంద్రం వద్ద వైద్యుల నిరసన

మనోరమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ర్యాలీ..

కంఠేశ్వర్ : వైద్య విద్యార్థిని మృతికి నిరసనగా మనోరమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మనోరమ ఆసుపత్రి వైద్య సిబ్బందితోపాటు, వివిధ విభాగాల వైద్యులు, మనోరమ ఆసుపత్రి నుండి ఎన్టీఆర్ చౌరస్తా, ఎల్లమ్మ గుట్ట చౌరస్తా మీదుగా ప్రగతినగర్ గుండా ర్యాలీగా ఆసుపత్రి వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కట్ట నరసింహ, డాక్టర్ హితేశ్, డాక్టర్ హరికృష్ణరెడ్డి మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చివరివరకు ఎంతగానో ప్రయత్నిస్తారని, అలాంటి పవిత్రమైన వైద్యవృత్తిపైన కొందరు కామాంధులు లైంగికదాడి జరిపి, హత్య చేయడం సిగ్గుచేటని అన్నారు.

విధులు బహిష్కరించిన వైద్యులు..

బోధన్ : వైద్యులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుమంత్, సోఫీ, స్త్రీ వైద్యురాలు సాల్వినా, ఫార్మసిస్ట్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీల ఆధ్వర్యంలో..

కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థిని హత్యాయత్నం గురికావడంతో ఆమె మృతికి సంతాపంగా పీఎంపీ యూనియన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తెలంగాణ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్‌ను మూసివేసి మృతిచెందిన వైద్యురాలికి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ టి.పి.యం.పి. అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ బోధన్ అధ్యక్ష కార్యద ర్శులు కే యాదాచారి, కారం స్వామి, సభ్యులు హనుమాండ్లు, రియాజ్, శ్రీనివాస్, బాలరాజ్, శివన్నారా యణ, అనిల్, నగేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ నీలిమా, డాక్టర్ ఉమా, హెడ్ నర్స్ మీర్జా బిపాసా, నర్సింగ్ ఆఫీసర్స్ వరలక్ష్మి, గంగామని, రజిత, మురళీ, రాజు, ఐసీటీసి కౌన్సిలర్ కెకె.రమేష్ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి సాహిస్తా ఫిర్దోస్, ఆయుష్ వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏఎన్ఎంలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, స్టాఫ్‌నర్స్‌లు, ఎంఎల్ హెచ్‌పిలు, శైలజ, స్టాఫ్‌నర్స్ లక్ష్మి, సుమలత, గంగామణి, రేఖ, శాంత, ఆయా ఆరోగ్య ఉప కేంద్రాల ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన..

కంఠేశ్వర్ : కలకత్తాలో జరిగిన వైద్యురాలి సంఘటనకు మద్దతుగా జిల్లా ఆయుష్ విభాగం తరఫున నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆయుష్ విభాగం ఇన్చార్జ్ డాక్టర్ నారాయణ మాట్లాడుతూ.. కలకత్తాలో జరిగిన వైద్యురాలి సంఘటనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా పరిగణలోకి తీసుకొని నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వాలు అండగా నిలబడాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ ఫార్మసిస్టులు పురుషోత్తం, ఉమాప్రసాద్, నీరజ, ఆశ, ఫార్మసిస్ట్ సిబ్బంది బిక్షపతి, రమేష్, శిరీష్, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఉద్యోగుల నిరసన..

నిజామాబాద్ సిటీ : కలకత్తాలో జూనియర్ యువ డాక్టర్‌పైన హత్య చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వెల్‌నెస్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. వెల్‌నెస్ సెంటర్ ఎదుట వెల్‌నెస్ వైద్యులు, సిబ్బందితో కలిసి నిరసన చేపట్టారు.

రెంజల్ : వైద్య పీజీ విద్యార్థినిపై అత్యాచారం, ఆపై హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దావఖాన కూనపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోదిత, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, చింతల శ్రావణ్ కుమార్, సూపర్‌వైజర్ మాలంబి, ఫార్మసిస్ట్ మోయిజ్, ఆరోగ్య కార్యకర్త కళావతి, ఎంహెచ్‌ఎల్పిలు ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్ : పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధులను శిక్షించాలని కోరుతూ వైద్యులు, వైద్య సిబ్బంది ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాపాడే చేతులను రక్షించుకొనే బాధ్యత అందరిపై ఉందని, ఇటువంటి కామాంధులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.



డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట



కంఠేశ్వర్ : మనోరమ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యుల ర్యాలీ

మృగాలను శిక్షించాలి

- వైద్యుల ఆందోళనకు ఐద్వా మద్దతు



కంఠేశ్వర్ : వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసి, హత్య చేసిన దుండగులను బహిరంగంగా శిక్షించాలని కోరుతూ జిల్లాలో డాక్టర్స్ చేస్తున్న ఆందోళనకు ఐద్వా మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. డాక్టర్‌పై హత్యాచారానికి హత్యకు పాల్పడిన వాళ్లని బహిరంగంగా శిక్షించాలన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఐద్వాగా హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, నగర నాయకులు వనజ, నాయకులు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవి కుమార్


మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో రవికుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

వాహనధారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ పెట్టుకోవాలని, హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. నాసిరకం హెల్మెట్లు కాకుండా ఐఎస్ఐ మార్కు ఉన్నవి కొనుగోలు చేయాలని, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో హెల్మెట్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, కొందరు తూతూ మంత్రంగా హెల్మెట్ తీసుకెళ్లి మమా అనిపిస్తున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ప్రాణనష్టం జరగడానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడమే ఓ కారణమని అన్నారు. జిల్లా సిపి కల్మేశ్వర్ ఆదేశానుసారం వాహనాల తనిఖీ విస్తృతం చేస్తున్నామని, మైనర్లు వాహనాలను నడపవద్దని సూచించారు.

గ్రామాల సమస్యలపై సాధారణ సమావేశం

నవతెలంగాణ-రెంజల్

గ్రామాలలో సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ, సాటాపూర్ గ్రామపంచాయతీలలో సాధారణ సమావేశాలను ఏర్పాటు చేశారు. తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు, హరితహారం, మురికి కాలువలను శుభ్రం చేయడం, తదితర అంశాలపై అవసరమైతే ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ, ఆశావర్కర్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజేందర్‌రవు, సాటాపూర్ జూనియర్ అసిస్టెంట్ అశోక్‌రావు, కారోబార్ మంగురాం, క్షేత్ర సహాయకులు శోభన్, అర్జున్, ఆరోగ్య కార్యకర్తలు జమున, సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న మహాలక్ష్మి అమ్మవారి (పోచమ్మ) ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన సరసం గంగారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.లక్ష విరాళంగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథ్, కొమ్ముల రవీందర్, వన్నెల రాజేశ్వర్, బద్దం ధన్‌రెడ్డి, చింతకుంట శ్రీనివాస్, గొల్ల మల్లయ్య, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బద్దం నాగేష్, బద్దం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యువకళోత్సవ్‌లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ బహుమతి

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్


ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

జిల్లా కేంద్రంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జిల్లాస్థాయి స్థాయి సాంస్కృతిక కార్యక్రమం యువ కళోత్సవ- 2024 పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 48 స్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొనగా.. అందులో ప్రథమ బహుమతి మెండోరా మండలంలోని వెల్గటూర్‌కు చెందిన లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్టు అసోసియేషన్ ప్రతినిదులు తెలిపారు. విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ అజ్మత్ శుభాకాంక్షలు తెలిపారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ మకరంద్
- జోన్ కార్యాలయాల తనిఖీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మకరంద్ అన్నారు. జిల్లా మున్సిపల్ పరిధిలోని సిబ్బంది సమయపాలన పాటిస్తూ పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. శనివారం ఉదయం నగరంలోని పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. నగరంలోని పూలాంగ్, గోల్ హనుమాన్ జోన్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. అనంతరం అర్సపల్లిలో గల రైల్వేగేట్ గ్రావెల్ పనులను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

వాటర్ సప్లై ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్..

మోపాల్ వాటర్ సప్లై ఫిల్టర్ బెడ్‌ను మున్సిపల్ కమిషనర్ శనివారం పరిశీలించారు. అదేవిధంగా ఆలం బ్లీచింగ్ సరైన పద్ధతిలో కలపాలని సిబ్బందికి సూచించారు. ఫిల్టర్ బెడ్ చుట్టూ నీరు ఎలా సప్లై అవుతుందో చూశారు. చెత్తాచెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహించరాదని, ఒకవేళ విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

హత్యలకు కారణం విచ్చలవిడి మద్యం వ్యాపారమే

నవతెలంగాణ-కంఠేశ్వర్

హత్యలకు కారణం విచ్చలవిడి మద్యం వ్యాపారమేనని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 6 సంవత్సరాల పాప నుంచి అరవై సంవత్సరాల అవ్వపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కారణం విచ్చలవిడి మద్యం వ్యాపారమే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎ.కె.లత, బహుజన శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఆశబాయి, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు స్వాతి, నగర నాయకులు జీజాబాయి, శాంతబాయి, రాధా, సోనీ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ శాఖ అధికారులు సీరియస్

- పోలీసుల బందోబస్తు మధ్య రేకుల షెడ్ల కూల్చివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని 10, 11వ డివిజన్ పరిధిలోని బొందెం చెరువు, భారత రాణినగర్ కాలనీలలో అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. అందులో భాగంగానే ఆర్డిఓ రాజేంద్ర కుమార్, తహసీల్దార్ బాలరాజు, పోలీస్ అధికారుల సమక్షంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను, రేకుల షెడ్లను జెసిబితో కూల్చారు. గత ప్రభుత్వ సమయంలో ఆనాటి అధికార పార్టీ కార్పొరేటర్లు ఇల్లీగల్‌గా బొందెం చెరువు శిఖం భూమిలో వెంచర్ ఏర్పాటు చేశారు. వారికి నాటి మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, రెవిన్యూ శాఖ అధికా రులు అండగా ఉండి అన్ని రకాల అనుమతులు అందించారు. చెరువు శిఖం భూమిలో ఏకంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సహకరించారు.

మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు సెల్ఫ్ అసెస్మెంట్ కింద కేటాయించడంతో అక్కడ అక్రమంగా రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని తెలుస్తుంది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతుండడంతో స్థానికులు కొందరు జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఒక కార్పొరేటర్, మరో కార్పొరే టర్ భర్త అందులో కీలకపాత్ర పోషించారని శిఖం భూమిలో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తాజాగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి చెంది కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అక్కడ నిర్మాణాలు చేసి ఇచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

అధికారులు ఇలాంటి చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇది ప్రతి ఒక్కరికి వర్తిస్తుందా లేదా ఫిర్యాదు చేస్తేనే అధికారులు స్పందిస్తారా అని ప్రజలు భావిస్తు న్నారు. ఎలా అయితే నిజామాబాద్ అర్బన్‌లో చాలా వరకు భూములను కబ్జా చేశారని వాటిని కూడా ప్రభుత్వ అధికారులు ఇలా చేస్తే బాగుంటుందని తమ అభిప్రాయాన్ని తెలుపుతున్నారు.

ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మహిళ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నూతనంగా నిర్మిస్తున్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతి చెందిన ఘటన నగరంలోని నాలుగవటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కవిత(28), భర్త, పిల్లలతో గత కొన్ని సంవత్సరాలుగా నగరంలో ఉంటున్నారు. ఈ మేరకు రోజువారీగా కూలీకి వెళ్ళిన కవిత కళ్లుతిరిగి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్టు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పాఠశాలల్లో రక్షాబంధన్


భీంగల్ : రక్షాబంధన్‌లో పాల్గొన్న విద్యార్థులు


నిజామాబాద్‌సిటీ : ఫ్యూచర్‌లైన్ పాఠశాలలో..

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని బోయగల్లీలో గల బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం సామూహిక రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వామి, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు లింబాద్రి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్య రమేష్, సీనియర్ ఉపాధ్యాయులు జాన్‌విల్సన్, రఘువాస్, పిఆర్టియు మండల అధ్యక్షులు వాసుదేవ్, శివ, రాజ్ కుమార్, వినోద్ సాగర్, వినోద్, భూమేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్ రమణ, మురళి, రాజేందర్, సంపూర్ణ, రాధికా రాణి, రవీందర్ పాల్గొన్నారు.